

# జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 86 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 25, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# మంత్రి పగా.. మహాముదురు!



ఆంధ్ర మీడియాను అక్కున చేర్చుకుంటున్నారు

తెలంగాణ మీడియాను బలిగొంటున్నారు

తెలంగాణ ప్రెస్ అకాడమికి సీఎం కేటాయించిన 1000 కోట్లు ఏమయ్యాయి

ప్రభుత్వం అనిచివేత జర్నలిస్టుల వైపు మళ్ళింది

ప్రశ్నించే గొంతుకలను లేకుండా చేస్తున్న ప్రభుత్వం

రాజ్యాంగ రక్షణ దారులు చేసే పని ఇదేనా

43 వేల వరకు అక్రిడిటేషన్స్ ఇస్తామన్న ప్రభుత్వం చేసే పని ఇదేనా

ఎటూకెళ్లి అధికారులను భదునాం చేసే ప్రయత్నం జరుగుతుంది

పనికిమాలిన జీవోతో జర్నలిస్టుల ఉసురు పోసుకుంటున్నారు

మంత్రి వ్యాపారాలను ప్రశ్నిస్తే ఇంతటి కక్ష సాధింపులా : డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

కేవలం ఒక మంత్రి వ్యాపారాలను ప్రశ్నిస్తున్నందున యావత్ తెలంగాణ రాష్ట్ర మీడియాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం భరించరాని వేదనగా ఉందని డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తపరిచారు. అన్ని రకాల సంఘాలను అన్ని రకాల పార్టీలను అంచివేస్తున్న రీతిగాని జర్నలిస్టు సంఘాన్ని అంచివేయాలనుకోవడం ప్రభుత్వం గొప్పతనంలాగా భావిస్తుందన్నారు. గతంలో తెలంగాణ మీడియా అకాడమీ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రెస్ అకాడమీ సంక్షేమ అభివృద్ధి కోసం 1000 కోట్లు ప్రకటించి నిధులను మంజూరు చేసినప్పటికి కేవలం జర్నలిస్టుల సంక్షేమం కోసం మాత్రమే కేటాయించబడిన వెయ్యి కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తో పాటు తెలంగాణ ప్రెస్ అకాడమీ కమిటీ వాటిని దేనికోసం ఉపయోగించారన్నది నేటి వరకు ప్రస్నార్థకంగానే మారిపోయిందన్నారు. ప్రతి పేదవాడైన జర్నలిస్టు సంక్షేమ అభివృద్ధి కోసం కేటాయించబడిన నిధులు ఎందుకు నిరుపయోగంగా దాచపడుతున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో అత్యంత ప్రమాదకరమైన



**డాక్టర్ బరిగెల శివ**
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారు

మార్చి 16 నుంచి 30 వరకు జరగనున్న సమావేశాలు

మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

మార్చి 20న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీలో నిర్ణయం

2




## హైదరాబాద్‌లో అకాల వర్షం

నగరానికి ఆరెంజ్ అలర్ట్


హైదరాబాద్‌లో పలుచోట్ల కురిసిన వర్షం

మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో స్తంభించిన ట్రాఫిక్

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

అల్పపీడనం ప్రభావంతో మరో రెండు రోజులు వానలు

ఉరుములు, ఈదురుగాలులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



2

## వాహన్ పోర్టల్‌లోకి తెలంగాణ


మార్చి 15 నుంచి వాహన సేవలు పూర్తిగా ఆన్‌లైన్


3

## రైతుబంధు ఇక లేనట్లేనా?

క్యాబినెట్ సమావేశంలో ప్రస్తావన లేకపోవడంతో రైతుల్లో ఆందోళన

2





## అంబర్‌పేట్‌లో విషాదం.. ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

ఉరి వేసుకుని భార్యాభర్త, మణికట్టు కోసుకుని కొడుకు బలవన్మరణం

హోటల్ నిర్వహణలో నష్టాలతో అప్పులపాలైన యజమాని

ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యలకు కారణమని పోలీసుల అనుమానం

2

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV

# రైతుబంధు ఇక లేనట్లేనా?

**క్యాబినెట్ సమావేశంలో ప్రస్తావన లేకపోవడంతో రైతుల్లో ఆందోళన**



**హైద్రాబాద్, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రైతులకు ఆర్థిక సహాయంగా అందించే రైతుబంధు పథకం భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా క్యాబినెట్ సమావేశంలో రైతుబంధు అంశం ప్రస్తావనకు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. డిసెంబర్‌లో ఇవ్వాల్సిన రైతుబంధు ఇప్పటివరకు విడుదల కాలేదు. మున్సిపల్ ఎన్నికల అనంతరం ఫిబ్రవరి 4 తర్వాత రైతుబంధు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారు. అదే విధంగా, ఫిబ్రవరి 5 నాటికి నాట్లు పూర్తయ్యేలోపు రైతుబంధు జమ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. అయితే ఎన్నికలు పూర్తయ్యాయి. పొలాల్లో నాట్లు కూడా ముగిశాయి. అయినప్పటికీ తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో రైతుబంధు అంశం ప్రస్తావనకు రాకపోవడం గమనార్హం. అంతేకాకుండా, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాబినెట్ సమావేశానికి హాజరుకాలేదన్న సమాచారం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. రైతులు ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కార్మిక ఖర్చులతో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో రైతుబంధు ఆలస్యం కావడం వారి భారం మరింత పెంచుతోంది. ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రైతుబంధు విడుదలపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందా? లేక పథకంలో మార్పులు చేయనున్నదా? అనే ప్రశ్నలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రైతులకు నేరుగా లాభం చేకూర్చే ఈ పథకం భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

# తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారు

**మార్చి 16 నుంచి 30 వరకు జరగనున్న సమావేశాలు**
**మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం**
**మార్చి 20న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీలో నిర్ణయం**

**(హైదరాబాద్ జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. సమావేశాల తొలిరోజైన మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రసంగిస్తారు. అనంతరం మార్చి 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుపుతారు. మార్చి 20వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు.

# అంబర్‌పేట్‌లో విషాదం..

## ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

**ఉరి వేసుకుని భార్యాభర్త, మణికట్టు కోసుకుని కొడుకు బలవన్మరణం**
**ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యలకు కారణమని పోలీసుల అనుమానం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందులే ఈ ఘోర నిర్ణయానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. మృతులను రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), మరియు కుమారుడు శశాంక్ (24) గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రామరాజు స్థానికంగా హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో రామరాజు అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రామరాజు ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. తలుపులు తెరిపించి చూడగా లోపల ముగ్గురూ విగతజీవులుగా కనిపించారు. రామరాజు, మాధవి ఉరివేసుకుని ప్రాణాలు తీసుకోగా, శశాంక్ తన మణికట్టు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల భారం పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై కుటుంబమంతా ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. కేసు నమోదు చేసి ఆర్థిక లావాదేవీల కోణంలో విచారణ జరుపుతున్నారు.

# హైదరాబాద్‌లో అకాల వర్షం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరంలో మంగళవారం అకాల వర్షం ముంచెత్తింది. గత రెండు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన నగరవాసులకు ఈ వర్షం ఉపశమనం కలిగించినప్పటికీ, పలుచోట్ల జనజీవనానికి అంతరాయం కలిగించింది. ముఖ్యంగా మియాపూర్, చందానగర్, కోండాపూర్, మదీనాగూడ, లింగంపల్లి వంటి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గంగారం నుంచి మియాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహనాలు నిలిచిపోయి తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని, గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, పాత భవనాల వద్ద నిలబడవద్దని సూచించింది. ఈ అకాల వర్షాలు రైతులపై మిశ్రమ ప్రభావం చూపుతున్నాయి. కొన్ని ఆరుతడి పంటలకు ఈ వానలు మేలు చేస్తుండగా, ఈదురుగాలులు, వడగళ్ల కారణంగా చేతికొచ్చిన వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీ చేసింది.

# మంత్రి "పగా" మహాముదురు

మొదటి పేజీ తరువాయి

సంఘటనగా కొనసాగుతున్న అక్రిడిటేషన్స్ మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252 తెలంగాణ రాష్ట్రంలోని సాదాసీదా జీవనం గడుపుతున్న వర్కింగ్ జర్నలిస్టుల జీవితాలను పూర్తిగా శాసిస్తూ అంచివేస్తున్నట్లుగా ఉంటుండగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జర్నలిస్టు సంఘాలు అట్టి జీవోను వ్యతిరేకించడమే కాకుండా పలు ధర్నాలు నిర్వహించి గత ప్రభుత్వం విడుదల చేసిన జీవోతోపాటు మంజూరు చేసిన అక్రిడిటేషన్స్ అన్నిటికీ న్యాయం చేస్తూ రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో కొత్తరకపు అక్రిడేషన్లను అదనంగా విడుదల చేస్తూ పేద జర్నలిస్టులకు సహాయ పడాల్సింది పోయి ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శిస్తూ జర్నలిస్టుల సంక్షేమాన్ని అణిచివేయాలని చూడడం దాన్ని కూడా రాష్ట్ర ప్రెస్ అకాడమీని అడ్డం పెట్టుకొని వాళ్లతోనే జీవోపై ప్రకటనలు ఇప్పిస్తూ ప్రభుత్వ అణచివేతను సమర్థించుకోవడం వికారంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రెస్ అకాడమీ సంక్షేమ అభివృద్ధి కోసం కేటాయించిన వెయ్యి కోట్లలో కేబుల్ ఛానల్ యాజమాన్యాలకు ఆర్థిక సహాయాన్ని అందించైనా ఆదుకోవాల్సింది పోయి నేటి వరకు ప్రభుత్వం విడుదల చేసిన జీవోను కఠినంగా కక్షపూరితంగా అమలుపరుస్తూ జర్నలిస్టు సమాజాన్ని నాశనం చేయాలని చూస్తుండడం ప్రభుత్వ మొండితనానికి నిదర్శనంగా మారిందన్నారు. చివరకు ప్రభుత్వ దుర్మార్గపు ఆగడాలు జర్నలిజమే లేకుండా చేయాలనేది కక్షపూరితమైన ప్రణాళికల్లో భాగం లాంటిది అన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆలోచన విధానం జర్నలిస్టు సమాజంపై ఏ విధంగా ఉందో తెలియదు గానీ పలుమార్లు తెలంగాణ మీడియా ప్రభుత్వ అధికారులతో సమావేశాలు నిర్వహించి గత ప్రభుత్వం అందించిన అక్రిడిడేషన్లకు రెండంతలు విడుదల చేస్తూ జర్నలిస్టులకు న్యాయం చేస్తున్నామని ప్రభుత్వం తరఫున అధికారికంగా పలు పత్రికా ప్రకటనలు విడుదల చేసినప్పటికిని లోలోపల జరిగే కుట్రలు మాత్రం పకడ్బందీగా అమలవుతూ జర్నలిస్టుల నాశనాన్ని శాసిస్తున్నాయని ఎంతో వేదనతో తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రావాలని మొండిపట్టుతో ప్రచారాలు కొనసాగిస్తున్న కేబుల్ ఛానల్ ను అణిచి వేయడం దాన్నే ప్రభుత్వం గొప్పతనంల భావించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చిందే కేబుల్ చానల్స్ నిజాయితీగా కాంగ్రెస్ పార్టీకి సహకరించాయన్న సంగతిని మర్చిపోవద్దన్నారు. ప్రభుత్వ కాల పరిమితి రెండున్నర సంవత్సరాలు గడిచిపోతుండగా జర్నలిస్టులను అణిచివేసి ఏం సాధిద్దాం అనుకుంటున్నారో ప్రభుత్వానికే చెల్లుబాటు అవుతుందన్నారు. మంత్రి వ్యాపారాలను మంత్రి ఆస్తులను మంత్రి పరిపాలనను ప్రశ్నిస్తున్నందునే కేవలం ఒక మంత్రి రాష్ట్రానికి సంబంధించిన సన్న కారు చిన్న కారు జర్నలిస్టులకు చెందిన కేబుల్ చానల్స్ యాజమాన్యాలను అణిచివేస్తూ కఠినంగా వ్యవహరించి అక్రిడిటేషన్ కార్డ్స్ రాకుండా అడ్డుపడుతూ అధికారులపై విపరీతమైన ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్లు తెలంగాణ సాధారణ జర్నలిస్టుల సంఘాలు తీవ్రంగా వేదన పడుతున్నాయన్నారు. అదే సందర్భంలో ప్రజాసేవకు మంత్రితో పాటు ప్రభుత్వం ఇంతలా ఎందుకు కఠిన తరంగా ప్రదర్శించడం లేదంటూ ప్రభుత్వం తరఫున ప్రజలకు సమాధానం చెప్పాల్సింది పోయి ప్రశ్నిస్తున్న మీడియాపై ఉక్కు పాదం మోపడం ప్రభుత్వం తెలివిలా భావిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలు ఏమోగానీ అణిచివేత మాత్రం ఆచరణకు సాధ్యం కాని రీతిలో ముందుకు సాగుతుందని ఒక్కానించి చెప్పారు. ఎలాంటి ఆంక్షలు లేని విధింపులతో 50 వేలకు పైన అక్రిడిటేషన్ ఇవ్వాల్సిన ప్రభుత్వం తీయటి మాటలతో కోతలు పెడుతూ జర్నలిస్టుల జీవితాలకు వాతలు పెడుతుందన్నారు. కేవలం ఒక్క మంత్రి ఇంతమంది జర్నలిస్టుల జీవితాలను నాశనం చేయాలని చూడడం మ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్ర మొదలుకొని నేటి వరకు ఇదే ప్రథమం అన్నారు. చరిత్ర చెరుపరానిదని అందరి జీవితాలను జర్నలిస్టు సమాజం గుర్తుకు పెట్టుకుంటుందని హెచ్చరించారు. సమయం చిక్కింది కదా అని జర్నలిస్టుల జీవితాలను శాసిస్తున్న మంత్రికి కాలం చెల్లించబోయే సమాధానం స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలని హితవు పలికారు. చాతనైతే సహాయపడాలి గాని పగలు కక్షలు పెంచుకొని జర్నలిస్టు సమాజాన్ని నాశనం చేయాలనుకోవడం మంత్రికి తగదన్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రెస్ అకాడమీ సంస్థకు పెద్ద ఎత్తున నిధులిస్తూ జర్నలిస్ట్ సంక్షేమాన్ని అభివృద్ధి పరుస్తామంటున్న ప్రభుత్వం వెనుక నుండి గోతితోడి అందులో సాధారణ జర్నలిస్టులను పాతర వేసే ప్రయత్నం చేస్తుందని ప్రస్తుతం ప్రభుత్వము అవలంబిస్తున్న కఠినతరమైన విధానాలు ప్రస్ఫుటంగా వెల్లడిస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను అణచివేసిన విధంగా జర్నలిస్టులను అణిచివేస్తామనుకోవడం కేవలం మంత్రికి ఒక్కరికి చెల్లుబాటుగా అనిపిస్తుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1000కి పైగా జర్నలిస్టులు ఖమ్మంలో చేరిపోయి ప్రస్తుతం మంత్రి చూపిస్తున్న చొరవకు తగిన సమాధానం చెప్పడానికి సిద్ధపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అన్నారు. పైసతో దేన్నైనా సాధిస్తాం అనుకుంటే తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలు అయ్యేదే కాదన్నారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ జర్నలిస్టులను అణిచివేస్తూ జర్నలిజాన్ని కఠిన తరం చేస్తూనే క్షేత్రస్థాయిలో అక్రిడిటేషన్స్ కేటాయించి జర్నలిస్టు సంక్షేమాన్ని పెద్ద ఎత్తున ఆదుకున్నదన్న సంగతిని ప్రస్తుత ప్రభుత్వానికి గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగించబడుతున్న 100 కేబుల్ చానల్స్ యాజమాన్యాలకు తగినన్ని అక్రిడిటేషన్స్ కేటాయించడం వల్ల ప్రభుత్వానికి కలిగే నష్టం ఏందో ఎవరికి అంతుచిక్కడం లేదు గాని జర్నలిజం సమాజంపై మంత్రి పగ మాత్రం మామూలుగా లేదన్న సంగతి బాహాటంగా వెల్లడవుతుందన్నారు. ప్రజల్ని మోసగించినంత సులువుగా ప్రభుత్వ యంత్రాంగాలను మోసగించినంత సులువుగా కాంట్రాక్టుల రూపంలో పోగు చేసుకుంటున్న సొమ్మును ప్రశ్నిస్తున్న వ్యక్తులపై ప్రశ్నిస్తున్న జర్నలిజంపై పగబట్టడం ఇకనైనా మానకపోతే రాష్ట్ర ప్రజల తీర్పుకు ప్రభుత్వం శిరసా వహించాల్సి వస్తుందన్న సంగతిని మరొకసారి గుర్తు చేశారు. జర్నలిస్టు సమాజాన్ని అణిచివేతే అనివార్యంలా భావిస్తున్న ప్రభుత్వాన్ని జర్నలిస్టు సమాజం ఏం చేయలేకపోవచ్చు గాని జర్నలిజం మాత్రం తగిన రీతిలో సమాధానం చెప్పబోతున్న సంగతిని ముందుగానే గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం కనపరుస్తున్న కఠిన తరాన్ని ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని జర్నలిజం సమాజం గుర్తించలేదనుకోవడం ఎవరికి మంచిది కాదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రతి అనిచివేత విధానాన్ని జర్నలిస్టు సమాజం లిఖితపూర్వకంగా రాసుకుంటుందని తగిన సమయంలో వాటిని ఉపయోగంలోనికి తీసుకురావడం ఖాయమన్నారు కేవలం గీ అల్లాటప్ప కేబుల్ చానల్స్ మమ్మల్ని ఏం చేస్తాయిలే అనుకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే ప్రస్తుత ప్రభుత్వానికి పడుతుందన్న సంగతిని బలమైన విశ్వాసంతో బలమైన నమ్మకంతో చెప్పడం జరుగుతుందన్నారు. ఆంధ్ర మీడియాకు సహాయపడుతున్న ప్రభుత్వం తెలంగాణ జర్నలిస్టులను హరిగోశ పెడుతూ తెలంగాణ సమాజం ముందు తీవ్రమైన అవమానాలకు గురి చేస్తుందని మరొకసారి హెచ్చరించారు.

# విశ్రాంత ఉద్యోగులను వేధిస్తున్న ప్రభుత్వం







**మహాధర్నాకు రంగం సిద్ధం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు**
**ఏకశిలా పార్క్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు**
**రిటైర్డ్ అయిన ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించండి**
**పెన్షనర్ల ప్రాణాలు కాపాడండి**
**ఎస్.జి.పి.ఏ.టి.రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.వీరస్వామి, రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ వెలిశోజు రామ మనోహర్ డిమాండ్**

**హన్మకొండ జై భీమ్ న్యూస్:**

సోమవారం 23 ఫిబ్రవరి 2026 సోమవారం రోజున రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ తెలంగాణ (ఎస్.జి.పి.ఏ.టి) హనుమకొండ వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండ లోని ఏకశిలా పార్కు వద్ద" ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ నిరాహార దీక్ష కార్యక్రమం రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ వెలిశోజు రామ మనోహర్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. వీరస్వామి నిరాహార దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్మెంట్ బకాయిలు రాక చనిపోయిన పెన్షనర్లకు ముందుగా సంతాపం ప్రకటించారు. అనంతరం నిరాహార దీక్ష కార్యక్రమానికి రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ వెలిశోజు రామ మనోహర్ అధ్యక్షత వహించగా హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇ.నరసింహారెడ్డి వరంగల్ జిల్లా అధ్యక్షులు తుమ్మ వీరయ్య సహా అధ్యక్షత వహించారు. అనంతరం రాష్ట్ర బాధ్యులు వెలిశోజు రామ మనోహర్, జి వీరస్వామి , కే. సుధీర్ బాబు మాట్లాడుతూ మార్చి 2024 నుండి ఇప్పటివరకు రిటైర్డ్ అయిన ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బకాయిలు చెల్లించాలని గత ఆరు నెలల నుండి కూడా నిరంతర పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఏ విధమైన స్పందన రాక పోవడం తో ఈరోజు" రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టడం జరిగినది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని అన్నారు. వివిధ రాజకీయ పార్టీల సహకారంతో ఇందిరా పార్కులో రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు దీక్షకు సంఘీభావంగా వచ్చిన రాష్ట్ర బిజెపి నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రావుల పద్మ, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి,,సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి నిరాహార దీక్ష శిబిరానికి సంఘీభావం ప్రకటించి,తదనంతరం మాట్లాడుతూ రిటైర్మెంట్ బకాయిలు ఆపడం సరికాదు వెంటనే చెల్లించాలని శాసనసభలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడారని వారు మార్చి ఒకటి వరకు రిటైర్మెంట్ బకాయిలు చెల్లించినట్లయితే మార్చి రెండవ తేదీ నుండి 5వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిరాహార దీక్షలు చేపడతానని వారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నిరాహార దీక్షకు సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నామని మీరు చేసే ఉద్యమం న్యాయ యుతమైనదని మీ బకాయిలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని మా పార్టీ రాష్ట్ర శాఖ కూడా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తుందని తెలియజేశారు. మీ ఉద్యమానికి అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమములో బాధిత నాయకుడు హనుమకొండ ఎస్.టి.ఓ. ప్రధాన కార్యదర్శి కందుకూరి దేవదాసు, వివిధ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల బాధ్యులు టీఎన్జీవో హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ గారు, ఎన్జీవో నాయకులు పుల్లూరు వేణుగోపాల్, డిటిఎఫ్ కే.శ్రీనివాస్, టి.పి.టి.ఎఫ్ శ్రీరామ్, సత్యనారాయణ, యూటీఎఫ్ నాయకులు టి.కుమార్ మాట్లాడుతూ మార్చి 2024 నుండి జనవరి 2026 వరకు రిటైర్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రిటైర్మెంట్ బకాయిలను 23 నెలలు గడిచినా చెల్లించకపోవడం దారుణమని, పెన్షనర్లను మానసికంగా వేధించడమేనని, తీవ్ర అనారోగ్యానికి గురి చేయడం ప్రభుత్వానికి సరియైనది కాదని వక్తలు డిమాండ్ చేశారు. ఇప్పటివరకు రిటైర్ అయిన ఉద్యోగులకు బకాయిలు చెల్లించకపోవడంతో నానా ఇబ్బందులకు గురిఅవుతూ,తమ ఆరోగ్యాన్ని బాగు చేసుకోలేని దయనీయమైన స్థితిలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపుగా 72 మంది పెన్షనర్లు రిటైర్మెంట్ బకాయిలు రాకపోవడంతో బాధతో, కృంగిపోయి, ఆరోగ్యం క్షీణించి చనిపోవడం జరిగినది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపుగా 21000 మంది రిటైర్డ్ అయ్యారు. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి రాష్ట్రంలోని ఇంకా దాదాపుగా 18 వేల మంది రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలను కాపాడాలని, వెంటనే రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు అన్నింటిని చెల్లించాలని పెండింగ్ లో ఉన్న నాలుగు డి.ఏ.లను వెంటనే ప్రకటించాలని, పిఆర్సి రిపోర్టు సబ్మిట్ చేసి పిఆర్సి 2023 ని వెంటనే ఆమోదించాలని నగదు రహిత హెల్త్ కార్డుల్లో పెన్షనర్లకు ఒక శాతం మాత్రమే కాంట్రిబ్యూషన్ తీసుకొని ఈ.పి.హెచ్.ఎస్. కమిటీలో 6గురు పెన్షనర్లను సభ్యులను తీసుకోవాలని వక్తలందరూ డిమాండ్ చేశారు. హాజరైన వారిలో యం. సింగారెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, జ్యోతి రమణి, రాధ,ఎల్. ప్రభాకర్ రెడ్డి,ఎస్. ధర్మేంద్ర, భోగేశ్వర్, గఫార్, మహబూబ్ అలీ, పి. సంజీవరెడ్డి, బి.రాధ, యన్. సుభాషిణి, ఎన్ రాజకొమురమ్మ, పి, ఆంజనేయులు,ఇ. ఇంద్రసేనారెడ్డి, రవీందర్, యం సంజీవరెడ్డి, కృష్ణారావు,రఘువీర్, బి.కృష్ణమూర్తి రవీందర్ సంజీవ్ కుమార్ పి.రాజి రెడ్డి, సారయ్య, రాజేందర్, కే.శ్యామ్ రావు, డాక్టర్ బి. కృష్ణమూర్తి, సి.హెచ్.సంజీవ రావు, తదితరులు 250 మంది పాల్గొన్నారు.


# ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**94 కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు**
**పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 94 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయబడినట్లు పేర్కొన్నారు. అందులో హన్మకొండలో 52, వరంగల్‌లో 24, జనగామలో 16 కేంద్రాలు ఉన్నాయి. ఈ పరీక్షలు ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడతాయి. పరీక్షల సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు పూర్తిగా నిషేధించబడినట్లు సీపీ తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ నిషేధాజ్ఞలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కమిషనర్, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు మరియు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.




## భద్రాద్రి జిల్లాలో ఇద్దరు ఎస్ఐలపై ఛీటింగ్ కేసు నమోదు

**(భద్రాద్రి జై భీమ్ న్యూస్)**

భద్రాద్రి జిల్లా బూర్గంపాడు పోలీసులు ఇద్దరు ఎస్ఐలపై ఛీటింగ్ కేసు నమోదు చేశారు. గతంలో భద్రాచలం టౌన్ ఎస్ఐగా పనిచేసిన మహేష్ పై, అతని తమ్ముడైన మరో ఎస్ఐ రాణాప్రతాప్ పై బూర్గంపాడు పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. వ్యాపారం పేరుతో, 35 శాతం అధికంగా చెల్లిస్తామంటూ కుమారి అనే మహిళ వద్ద రూ. 1.82 కోట్ల మొత్తం తీసుకుని మోసగించారనే అభియోగంపై పోలీసులు ఆ ఇద్దరు ఎస్ఐలపై ఛీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## కులం చిదిమేసింది..

నవమాసాలు మోసి
ఎన్నో ఆశలతో
బిడ్డ కోసం
ప్రసవ వేదనను
పంటికింద నొక్కిపట్టి
భరించిన కష్టం విలువ తెలియని
నీచ రాజకీయుల
కులగజ్జికి స్వస్థి పలకాల్సిందే..!

ఓట్లడిగే రోజు లేని కులం..
దేవుడి రూపంలో ఎందుకొచ్చింది..?

నాలుక మడిచిన నాయకులకు
కన్నతల్లి గోష కనిపిస్తలేదా..?
మా బీసీలు.. మా ఓట్లు..
రాజ్యాధికారం కోసమేనా..?

రాడేం ఎవ్వడు..కులం కోసం..!
నిలబడిన బడుగులకు నీరాజనం..

తక్కువ కులమన్నోన్నీ
తూర్పాల పట్టాలి..
అహంకారాన్ని అంధకారం చేయాలి..
ఒక్కటవ్వాలి నువ్వు నేను..
లేదింకా ఏ కులానికి అడ్డుకట్ట..

గొంతుమీద కాలు పెట్టిన..
కసాయికి కావరమరగాలి..!
పసిగుడ్డుపై పైశాశికత్వానికి
ఫలితమివ్వాలి..

కులదూషణకు నీ తెగింపే సమాధానమవ్వాలి.

మూగబోయిన అమ్మకు..
ఇదే నా నివాళు..

బిరాహుల్ కశ్యప్
9951184676

# వరంగల్ ఆరోగ్య రంగానికి ఎన్ఆర్ఐల అండ






**కేఎంసీ అభివృద్ధికి రూ.10 కోట్ల విరాళం**
**పుట్టిన గడ్డ అభివృద్ధికి ప్రవాస భారతీయుల ముందడుగు**

**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

స్వదేశం పట్ల అపారమైన ప్రేమ, పుట్టిన గడ్డకు రుణం తీర్చుకోవాలనే తపనతో ప్రవాస భారతీయులు మరోసారి ఆదర్శంగా నిలిచారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా అక్కడ స్థిరపడిన ఎన్ఆర్ఐలను కలుసుకుని స్వగ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరిన విషయం తెలిసిందే. ఆ విజ్ఞప్తికి స్పందించిన ప్రవాస భారతీయులు తాజాగా వరంగల్ ప్రజల ఆరోగ్య భద్రతకు మద్దతుగా కీలక నిర్ణయం తీసుకున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ సుజీత్ కుమార్ నేతృత్వంలోని సుమారు 200 మంది ఎన్ఆర్ఐలు కలిసి కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ) మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.10 కోట్ల విరాళం అందజేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ నిధులను ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు, అదనపు వార్డుల నిర్మాణం, అత్యవసర విభాగాల బలోపేతం, శస్త్రచికిత్స గదుల విస్తరణ, రోగుల కోసం మెరుగైన పడక సదుపాయాలు, విద్యార్థుల క్లినికల్ శిక్షణకు అవసరమైన సదుపాయాల కల్పన వంటి అంశాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి పరికరాల ఏర్పాటు ద్వారా నిర్ధారణ సేవలు వేగవంతం కావడంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు అధికంగా ఆధారపడే వైద్య కేంద్రాలు అయిన కాకతీయ మెడికల్ కాలేజీ మరియు మహాత్మా గాంధీ మెమోరియల్ హాస్పిటల్ (ఎంజీఎం) ఆసుపత్రులపై ఈ విరాళం సానుకూల ప్రభావం చూపనుంది. ప్రభుత్వ వైద్య రంగంలో మౌలిక సదుపాయాల పెంపుతో వేలాది మంది రోగులకు ప్రత్యక్ష ప్రయోజనం కలగనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, "విదేశాల్లో ఉన్నా స్వగ్రామ అభివృద్ధి కోసం ఇంత పెద్ద మొత్తాన్ని ప్రకటించడం గర్వకారణం. ఇది కేవలం విరాళం మాత్రమే కాదు, వరంగల్ పశ్చిమ ప్రజల ఆరోగ్య భద్రతకు పెట్టుబడి. మన ప్రాంతం నుంచి చదువుకుని విదేశాల్లో స్థిరపడిన వారందరికీ ఇది స్ఫూర్తి కావాలి" అని అన్నారు. ఎన్ఆర్ఐల సేవాభావం ప్రశంసనీయమని, ప్రభుత్వం కూడా ఆరోగ్య రంగ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, తాగునీటి సదుపాయాలు, విద్యాసంస్థల అభివృద్ధి వంటి అనేక మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పుడు ఆరోగ్య రంగంలోనూ అదే దిశగా కీలక అడుగులు పడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ప్రవాస భారతీయుల ఈ నిర్ణయం వరంగల్ వైద్య రంగానికి నూతన ఉత్సాహాన్ని అందించనుంది.

## వాహన్ పోర్టల్‌లోకి తెలంగాణ

**మార్చి 15 నుంచి వాహన సేవలు పూర్తిగా ఆన్‌లైన్**




**హైద్రాబాద్, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన 'వాహన్' పోర్టల్‌లోకి తెలంగాణ రాష్ట్రం మార్చి 15 నుంచి అధికారికంగా చేరనుంది. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ అవసరమైన సాంకేతిక, పరిపాలనా ఏర్పాట్లను పూర్తి చేస్తోంది. వాహనాలకు సంబంధించిన అన్ని రకాల సేవలు ఇకపై పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వాహనాలు కొనుగోలు చేసినా, అమ్మినా యాజమాన్య పేరు, చిరునామా మార్పుల కోసం ప్రాంతీయ రవాణా కార్యాలయాలకు (ఆర్‌టీఏ) వెళ్లాల్సిన అవసరం ఉండదు. వాహన్ పోర్టల్ ద్వారానే ఈ మార్పులను సులభంగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. అదేవిధంగా డూప్లికేట్ ఆర్సీ పొందడం, వాహన రిజిస్ట్రేషన్ వివరాలు తెలుసుకోవడం, వివిధ అనుమతుల కోసం దరఖాస్తు చేయడం వంటి సేవలు కూడా ఈ పోర్టల్ ద్వారా పొందవచ్చు. ముఖ్యంగా సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలు సమయంలో వాహన హిస్టరీ, పన్ను బకాయిలు, యాజమాన్య వివరాలు వంటి సమాచారాన్ని పారదర్శకంగా తెలుసుకునే వీలు ఉంటుంది. ఈ నిర్ణయంతో ఆర్‌టీఏ కార్యాలయాలపై భారం తగ్గడమే కాకుండా, మధ్యవర్తుల వ్యవస్థకు చెక్ పడనుంది. ప్రజలకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు సేవల పారదర్శకత పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డేటా సమీకరణ ప్రక్రియ తుది దశకు చేరుకున్నదని, మార్చి 15 నుంచి పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి రానున్నాయని రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి.

## ఇసుక మాఫియాపై కమలాపూర్ పోలీసుల కఠిన చర్యలు : 11 ట్రాక్టర్లు సీజ్

**ఇన్స్పెక్టర్ నవీన్ కమలాపూర్**

**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కమలాపూర్ మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై కమలాపూర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. మూనేరు వాగు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, మూడు రోజుల పాటు నిర్వహించిన దాడుల్లో మొత్తం 11 ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇసుక మాఫియా అక్రమంగా వాగుల నుంచి ఇసుకను తవ్వి రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఇన్స్పెక్టర్ నవీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల సమయంలో సరైన అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ నవీన్ మాట్లాడుతూ, "ఇసుక అక్రమ రవాణాపై ఎలాంటి రాజీ ఉండదు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాగుల నుంచి ఇసుకను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 11 ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశాం. భవిష్యత్తులో కూడా ఇటువంటి దాడులు కొనసాగుతాయి. అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు" అని హెచ్చరించారు. పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్థానిక ప్రజలు కూడా అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. కమలాపూర్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు.

## సైదాపుర్ మండలం ఎక్లాస్పూర్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం




**హుజూరాబాద్, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, హుజూరాబాద్ ఆధ్వర్యంలో సైదాపుర్ మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్బీఐ ప్రాజెక్టు, విడ్స్ సంస్థ మరియు స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు --- ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎం ఎస్.బి.వై), ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబివై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై), ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన (పీఎం జేడీవై), సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలపై గ్రామస్థులకు వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి క్రాంతికుమార్, గ్రామ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, వార్డు సభ్యుడు తిరుమ రవీందర్, యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా బీసీ పాయింట్ లక్ష్మీకాంత్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు డి. కిషోర్, బి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పథకాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## వరంగల్‌లో డిఫరెన్షియేటెడ్ టీబీ కేర్ శిక్షణ

**టీబీ ముక్త్ భారత్ అభియాన్ విజయవంతం చేయాలని అధికారుల పిలుపు**






**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ డిఎంహెచ్వో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం "డిఫరెన్షియేటెడ్ టీబీ కేర్" పై శిక్షణా కార్యక్రమం, సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో క్షయవ్యాధి నివారణకు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. టీబీ మరణాలను తగ్గించడంలో ఈ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారి డా. బ్లెస్సి మాట్లాడుతూ జనాభాలో హైరిస్క్ వర్గాలైన వృద్ధులు, హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులు, డయాబెటిస్ రోగులు, టీబీ కాంటాక్ట్ ఉన్నవారిని త్వరితగతిన గుర్తించడం అత్యంత అవసరమని చెప్పారు. గుర్తించిన కేసులను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, అవసరమైన మందులు సమయానికి అందించాలన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు వెల్లడించిన వివరాల ప్రకారం జిల్లాలో విస్తృత స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించి 60 ఏళ్లు పైబడిన వారు, హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులు, డయాబెటిస్ రోగులు, టీబీ కాంటాక్ట్ ఉన్నవారు కలిపి మొత్తం 1,93,935 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 73,711 మందికి ఛాతీ ఎక్స్‌రేలు చేయగా, 1,104 మందిలో టీబీ నిర్ధారణ అయ్యింది. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, జిల్లా టీబీ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో టీబీ నిర్మూలన లక్ష్య సాధనకు వైద్యశాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

## పెగడపల్లి గ్రామంలో ఈరోజు నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఓవర్‌లోడ్ డీటీఆర్‌ల ఏర్పాటు పనులు**

**వినియోగదారుల సహకారం కోరిన అధికారులు**




**హసన్‌పర్తి, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఈ రోజు (25.02.2026) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు హసన్‌పర్తి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఎడిఈ) పి. అశోక్ వెల్లడించారు. గ్రామంలో ప్రస్తుతానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు అధిక లోడుతో పనిచేస్తుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఓవర్‌లోడ్ అయిన డీటీఆర్‌ల స్థానంలో కొత్త డీటీఆర్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచే పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పనులు సురక్షితంగా మరియు వేగవంతంగా పూర్తి చేసేందుకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వస్తోందని స్పష్టం చేశారు. ఈ పనులు పూర్తయిన తర్వాత గ్రామానికి స్థిరమైన మరియు మెరుగైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు. వ్యవసాయ పంప్‌సెట్లు, గృహ వినియోగదారులు, వాణిజ్య సంస్థలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా నిలిపివేత సమయంలో వినియోగదారులు సహనంతో వ్యవహరించి, విద్యుత్ శాఖ సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని ఏ.డీ.ఈ పి. అశోక్ కోరారు. పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.

# సిద్ధాపూర్‌లో దారుణ హత్య

**ఘటన స్థలాన్ని పరిశీలించిన డీసీపీ దార కవిత**

**మహిళపై కేసు నమోదు, గ్రామంలో ఉద్రిక్తత**





**హసన్ పర్తి, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం సిద్ధాపూర్ గ్రామంలో జరిగిన దారుణ హత్య సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఓ మహిళపై మర్డర్ కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందిస్తూ, డీసీపీ దార కవిత స్వయంగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల వివరాల ప్రకారం, సిద్ధాపూర్‌కు చెందిన బాల్నే రాజ్‌కుమార్ (40) గుమస్తాగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని తండ్రి బాల్నే మొగిలి, తల్లి సరోజన గత 20 సంవత్సరాలుగా హనుమకొండలోని అమృత హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు. కుటుంబానికి చెందిన సొంత ఇల్లు సిద్ధాపూర్‌లో ఉండగా, కుటుంబ సంబంధాల నేపథ్యంలో వంగ ఇందిర అక్కడే నివసిస్తూ వచ్చినట్లు సమాచారం. మూడు నెలల క్రితం సరోజన మృతిచెందడంతో బాల్నే మొగిలి స్వగ్రామానికి వచ్చి తన ఇంట్లో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న వంగ ఇందిరతో తరచూ వాగ్వాదాలు జరుగుతున్నాయని, ఆ విషయాన్ని తన కుమారుడు రాజ్‌కుమార్‌కు కూడా పలుమార్లు తెలిపినట్లు తెలుస్తోంది. మంగళవారం (24-06-2026) ఉదయం రాజ్‌కుమార్‌కు బావమరిది వంగ సారంగపాణి ఫోన్ చేసి, సొంతింటి వెనుక భాగంలో బాల్నే మొగిలి మృతదేహం పడి ఉందని సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడికి చేరుకున్న రాజ్‌కుమార్ తన తండ్రి ముఖం, నుదురు భాగంలో పదునైన ఆయుధంతో దాడి చేసిన గాయాలు ఉన్నట్లు గమనించాడు. ఛాతీ మరియు మెడ చుట్టూ కూడా తీవ్ర గాయాలు కనిపించడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. ఫిర్యాదు ఆధారంగా వంగ ఇందిరపై హత్య కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇక సంఘటనా స్థలాన్ని డీసీపీ దార కవిత సవివరంగా పరిశీలించారు. మృతుడు హత్యకు గురైన ఇంటి వెనుకభాగాన్ని పరిశీలిస్తూ, అక్కడ లభ్యమైన ఆధారాలను సేకరించేందుకు ఫోరెన్సిక్ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. కేసును ప్రతి కోణంలో విచారించాలని, ఆధారాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. డీసీపీ వెంట హసన్‌పర్తి ఇన్స్పెక్టర్ చేరాలు, ఎస్ఐ దేవేందర్, రవి తదితర సిబ్బంది పాల్గొన్నారు. స్థానికులను ప్రశ్నించి వివరాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీలు సేకరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. కుటుంబ వివాదాల నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులో ఉంచుతున్నారు. ఈ ఘటనతో సిద్ధాపూర్ గ్రామం ఒక్కసారిగా భయాందోళనకు గురైంది. దర్యాప్తు పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## స్టేషన్ ఘనపూర్‌లో విద్యుత్ పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి






**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకునే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. హన్మకొండలోని తెలంగాణ ఎన్పిడిసిఎల్ ప్రధాన కార్యాలయంలో ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి తో కలిసి విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పెండింగ్ సబ్ స్టేషన్లు, లైన్ షిఫ్టింగ్, కొత్త కనెక్షన్లు, ఇందిరమ్మ ఇండ్లకు విద్యుత్ సరఫరా తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. జఫర్‌గడ్ మండలం సాగరం, స్టేషన్ ఘనపూర్ మండలం కొండాపూర్, రఘునాథపల్లి మండలం కుర్చపల్లి సబ్ స్టేషన్లను మార్చి 10లోపు ప్రారంభించాలని సూచించారు. చిల్పూర్ మండలం లింగంపల్లి, నష్కల్, పల్లగుట్ట, స్టేషన్ ఘనపూర్ మండలం నారాయణపురం సబ్ స్టేషన్లకు భూ కేటాయింపును త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే సంబంధిత అధికారులకు తానే ఆదేశాలు ఇస్తానన్నారు. ఫతేషాపూర్ సబ్ స్టేషన్ పనులను మే 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా చాగల్, పామునూర్ గ్రామాల్లో కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటుకు, జఫర్‌గడ్‌లో 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ లైన్లను వెంటనే షిఫ్టింగ్ చేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కాలనీలకు కొత్త లైన్లు వేయాలని, దరఖాస్తు చేసుకున్న వారికి తక్షణమే కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు జీరో బిల్ పథకం అమలు చేయాలని కోరారు. ఘనపూర్--జఫర్‌గడ్--వర్ధన్నపేట నాలుగు లైన్ల రహదారి పనుల నేపథ్యంలో అవసరమైన చోట పోల్స్ షిఫ్టింగ్ లేదా ఎక్స్‌టెన్షన్ పనులు చేపట్టాలని తెలిపారు. లైన్ షిఫ్టింగ్ పనులకు సంబంధించిన అంచనాలు సిద్ధం చేస్తే ముఖ్యమంత్రి వద్ద నుంచి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీ నిధులు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ ఘనపూర్ పూర్తిగా వ్యవసాయాధారిత నియోజకవర్గమని, దేవాదుల ప్రాజెక్టు ద్వారా రిజర్వాయర్లకు గోదావరి జలాలు రావడంతో భూగర్భ జలాలు పెరిగి విద్యుత్ వినియోగం అధికమైందన్నారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా సబ్ స్టేషన్ల మంజూరు ఇచ్చిన సీఎండి వరుణ్ రెడ్డికి రైతులు, ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఈఈలు, డిఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మారథోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి అరవింద్ లింబావలి







**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

మహదేవపుర నియోజకవర్గంలోని ఇమ్మడిహళ్లిలో జరిగిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మ రథోత్సవంలో భాగంగా, మాజీ మంత్రి అరవింద్ లింబావలి పాల్గొని మాట్లాడుతూ, శ్రీ వెంకటరమణ స్వామి, శ్రీ కంఠేశ్వర, శ్రీ రేణుక యల్లమ్మ, శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి, ద్రౌపదమ్మ ఆలయాలను సందర్శించి ప్రార్ధనలు చేశామని అన్నారు. దర్శనం తర్వాత, శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మ రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని, దేవుడికి ప్రత్యేక పూజలు చేసి, దేశంలోని ప్రతి ఒక్కరికీ ఆశీస్సులు ప్రసాదించాలని ప్రార్ధించారు. ప్రతి సంవత్సరం లాగే, ఈ సంవత్సరం కూడా, శ్రీ వెంకటరమణ స్వామి బ్రహ్మ రథోత్సవంలో పాల్గొనడం, స్వామిని పూజించడం మరియు రథయాత్ర చేయడం ఆచారం. దేవుడికి ప్రత్యేక పూల అలంకరణలు మరియు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని హగ్దూర్, వైట్‌ఫీల్డ్, చన్నసంద్ర, వర్తూరు, గుంజూరు, హూడి, నల్లూరహళ్లి, నాగొండనహళ్లి, కాడిగుడితోపాటు పలు గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని కృపకు పాత్రులయ్యారు. వేలాది మంది భక్తులకు అన్నదానం, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు ఎల్.రాజేష్, వర్తూరు శ్రీధర్, మహేంద్రమోడి, ప్రభు, చంద్రశేఖర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నాయిని రాజేందర్ రెడ్డి, స్నేహ శబరీష్ చేతుల మీదుగా దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లాలోని ఐదుగురు దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. విద్యా, ఉపాధి అవకాశాల్లో దివ్యాంగులు ముందుకు సాగేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, ల్యాప్‌టాప్‌లు దివ్యాంగుల విద్యాభ్యాసం, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడతాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకొని మరిన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, సామాజిక వేత్త ఈ.వి. శ్రీనివాస్ రావు, ఎఫ్ఆర్వో రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటీఐ కాజీపేటలో కొత్త కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ కళాశాల, కాజీపేటలో పీఎంకేవీవై (పి.ఎం.కే.వి.వై.4.0) పథకం కింద "ఎలక్ట్రిక్ వెహికిల్ సర్వీస్ టెక్నీషియన్", "సీఎన్‌సీ ఆపరేటర్ (టర్నింగ్)" కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో ఈ స్వల్పకాలిక శిక్షణ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. కోర్సుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీస్ టెక్నీషియన్ -- 40 సీట్లు, సీ.ఎన్.సి ఆపరేటర్ (టర్నింగ్) -- 20 సీట్లు. ఈ కోర్సులకు అర్హులైన అభ్యర్థులు నేరుగా కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతులు 02-03-2026 నుండి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఐటీఐ పాస్ అయి ఉండాలని, అవసరమైన అర్హతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ప్రాక్టికల్ ఆధారిత బోధన అందించబడుతుందని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఐడీ ప్రూఫ్ తదితర పత్రాలతో కళాశాలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 7013397132, 7013988677 కు సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.


# ఇంటర్, 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**ములుగు జిల్లా, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి కార్యదర్శులు డా. యోగితా రాణా, కృష్ణ ఆదిత్య, నికోలస్ తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ, పీఎం శ్రీ పాఠశాలలు, సమగ్ర శిక్షా అభియాన్ అమలు తదితర అంశాలపై సమీక్షించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, వైద్య సదుపాయాలు, సీసీ కెమెరాలు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరాదని,





కఠిన తనిఖీల అనంతరం విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించాలని తెలిపారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా సానుకూల వాతావరణం కల్పించాలని, ప్రత్యేకించి దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, సమగ్ర శిక్షా అభియాన్ అమలులో నాణ్యతపై దృష్టి సారించాలని సీఎస్ రామకృష్ణారావు పేర్కొన్నారు. ములుగు జిల్లా నుంచి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు 10 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం 1,981 మంది, ద్వితీయ సంవత్సరం 1,860 మంది విద్యార్థులు, మొత్తం 3,841 మంది హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 10వ తరగతి పరీక్షలకు జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 3,290 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, డీఐఈఓ, డీఈవో, ఎన్పీడీసీఎల్ డీఈ, డీటీఓ, టీజీఎస్ఆర్టీసీ డీఎం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి మాచర్లకు బంగారు పతకం

### వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ అభినందనలు



**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఇండోనేషియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థిని కృష్ణవేణి మాచర్ల బంగారు పతకం సాధించి విశ్వవిద్యాలయానికి కీర్తి తీసుకువచ్చారు. ఫిబ్రవరి 15న ఇండోనేషియాలోని సురకర్తా నగరంలో గోర్ ఎఫ్‌కోర్ యూనివర్సిటీలో నిర్వహించిన ఇండోనేషియా ఇంటర్నేషనల్ పారా త్రోబాల్ మ్యాచ్ సిరీస్‌లో ఆమె అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నట్లు విశ్వవిద్యాలయ డిఫరెంట్లీ ఎబుల్డ్ సెల్ సంచాలకులు డాక్టర్ ఎ. రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణవేణి మాచర్ల కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని. అంతర్జాతీయ వేదికపై ఆమె సాధించిన ఈ విజయం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి మరియు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం కృష్ణవేణిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి : ఏబీవీపీ



**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కాకతీయ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ రెండో గేట్ వద్ద పెండింగ్‌లో ఉన్న రూ. 8,500 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీలు, విద్యా వ్యవస్థను పట్టించుకోవడం లేదని, విద్యార్థులను విద్యకు దూరం చేసే విధానాన్ని అవలంబిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ. 8,500 కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ కళాశాలలు, యూనివర్సిటీలలో చదువుతున్న విద్యార్థులకు కూడా స్కాలర్‌షిప్‌లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మెరిట్ ఆధారంగా యూనివర్సిటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులు కోర్సు పూర్తయ్యాక ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో స్కాలర్‌షిప్ బకాయిల కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి లేదని, రూ. 5,000 కోట్లతో విగ్రహాలు ఏర్పాటు చేయడంలో చూపుతున్న ఆసక్తి, రూ. 8,500 కోట్ల స్కాలర్‌షిప్ బకాయిల చెల్లింపులో ఎందుకు చూపడంలేదని ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనివర్సిటీ సెక్రటరీ మేకల జ్ఞానేశ్వర్, యూనివర్సిటీ ఇంచార్జ్ డా. నిమ్మల రాజేష్, సాయి, అఖిల్, భారత్, రాజు, రజినీకాంత్, శివ, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మాల జాతర బ్రహ్మోత్సవాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష

**వరంగల్, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద కలెక్టరేట్ లో మంగళవారం గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 3 నుంచి మార్చి 8 వరకు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలీస్, ఆరోగ్య, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, జిల్లా పంచాయతీ, పౌర సంబంధాల, అగ్నిమాపక తదితర శాఖలు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జాతర సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణలు, చలువ పందిళ్లు, క్యూ లైన్లు, త్రాగునీటి సదుపాయం, అన్నదాన కార్యక్రమాలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, వైద్య శిబిరాలు, శానిటేషన్ చర్యలు సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జాతర ప్రాశస్త్యాన్ని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా పౌర సంబంధాల శాఖతో సమన్వయం చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆలయ కార్యనిర్వాహక అధికారిని సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీవో సుమ, గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం కింద ప్రైవేట్ పాఠశాలలకు దరఖాస్తుల ఆహ్వానం

**ములుగు, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



ములుగు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2025--26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం కింద విద్యార్థుల ప్రవేశాల కోసం అర్హత గల ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వెల్లడించారు. ఈ పథకం ద్వారా 1వ తరగతి నాన్-రెసిడెన్షియల్ మరియు 5వ తరగతి రెసిడెన్షియల్ ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యా ప్రమాణాలు కలిగిన ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే పాఠశాలలు తగిన మౌలిక వసతులు, విడిగా వసతిగృహ సదుపాయం (రెసిడెన్షియల్ కోర్సుల కోసం) కలిగి ఉండాలి. గడిచిన ఐదేళ్లలో పదో తరగతి ఫలితాలలో కనీసం 90 శాతం ఉత్తీర్ణత, అందులో 50 శాతం ప్రథమ శ్రేణి ఫలితాలు సాధించి ఉండటం తప్పనిసరి అని స్పష్టం చేశారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 24-02-2026 నుండి ప్రారంభమై 25-03-2026 వరకు కొనసాగుతుంది. ఆసక్తి గల పాఠశాలలు తమ దరఖాస్తులను 25-03-2026 లోపు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం, ములుగు వద్ద సమర్పించాలని సూచించారు. ఈ పథకం కింద 1వ తరగతి నాన్-రెసిడెన్షియల్ విద్యార్థికి సంవత్సరానికి రూ. 28,000/- మరియు 5వ తరగతి రెసిడెన్షియల్ విద్యార్థికి సంవత్సరానికి రూ. 42,000/- ఫీజును ప్రభుత్వం చెల్లించనున్నట్లు అధికారి తెలిపారు. అర్హత గల ప్రైవేట్ పాఠశాలలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థుల విద్యా అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

## ఆత్మకూరులో "అరైవ్ అండ్ అలైవ్" రోడ్ సేఫ్టీ కార్యక్రమం ఘనంగా నిర్వహణ

**ఆత్మకూరు, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**





రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఆత్మకూరు ప్రధాన కేంద్రంలో "అరైవ్ అండ్ అలైవ్" రోడ్ సేఫ్టీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏసీపీ పార్కల్ సతీష్ బాబు, మణీషా నెహ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు సభను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచే ఉద్దేశంతో ఐదుగురు వ్యక్తులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అలాగే రోడ్ సేఫ్టీ సందేశాన్ని విస్తృతంగా చాటిచెప్పేందుకు ఆత్మకూరు పోచమ్మ ఆలయం నుండి గూడెపడ్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి సురక్షితంగా ప్రయాణించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఎస్ఐ తిరుపతి, ఎస్ఐ సతీష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు ట్రాఫిక్ భద్రతపై చైతన్యం

### కాజీపేటలో 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమం







**వరంగల్, 24 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

యువతలో ట్రాఫిక్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో చేపట్టిన 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమం రెండో దశ విజయవంతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హంటర్ రోడ్ న్యూ సైన్స్ డిగ్రీ కాలేజీలో ప్రత్యేక ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జరిగింది. అదనపు డీసీపీ ట్రాఫిక్ రాయల ప్రభాకర్ రావు, ఏసీపీ ట్రాఫిక్ టి. సత్యనారాయణ మార్గదర్శకత్వంలో కాజీపేట ట్రాఫిక్ సీఐ పిట్టల వెంకన్న ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. రోడ్డు ప్రమాదాల ప్రధాన కారణాలు, నిర్లక్ష్య డ్రైవింగ్ దుష్పరిణామాలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులు, ట్రాఫిక్ సంకేతాల ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, 18 సంవత్సరాలు పూర్తైన ప్రతి ఒక్కరూ చట్టబద్ధంగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం వ్యక్తిగత భద్రత మాత్రమే కాకుండా సమాజ భద్రతకూ అవసరమని పేర్కొన్నారు. సుమారు 150 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా అదనపు డీసీపీ ట్రాఫిక్ రాయల ప్రభాకర్ రావు, ఏసీపీ ట్రాఫిక్ టి. సత్యనారాయణ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కమలాకర్, వైస్ ప్రిన్సిపాల్, ట్రాఫిక్ ఎస్ఐలు శ్రావణ్ కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శాయంపేట ట్రాఫిక్ జంక్షన్ వద్ద హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను గుర్తించి వారికి హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. హెల్మెట్ లేకుండా వచ్చిన కొంతమంది వాహనదారులకు అధికారులు స్వయంగా హెల్మెట్లు అందజేశారు. యువత ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి, సురక్షిత ప్రయాణాన్ని అలవాటు చేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రమాదాలను తగ్గించి ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో పోలీస్ శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

## శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడుతున్న రోగికి (టఎవిఐ) శస్త్రచికిత్స ప్రాణాలను కాపాడింది




**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు నగరంలోని వైట్‌ఫీల్డ్‌లోని మెడికోవర్ హాస్పిటల్‌లో అకస్మాత్తుగా తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులతో ఆసుపత్రిలో చేరిన రోగికి తీవ్రమైన కాల్సిఫిక్ అయోర్టిక్ స్టెనోసిస్ (ఫంక్షనల్ బైకస్పిడ్ వాల్వ్) ఉన్నట్లు నిర్ధారణ అయింది. ప్రారంభ కరోనరీ యాంజియోగ్రఫీ సాధారణ కరోనరీ ధమనులను చూపించింది. అయితే, రోగి పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, మొదట్లో సంప్రదాయవాద చికిత్స ఇవ్వబడింది మరియు అత్యవసర ( టఎవిఐ) ప్రక్రియ సూచించబడింది. ఈ ( టఎవిఐ) ప్రక్రియను మెడికవర్ హాస్పిటల్‌లోని సీనియర్ కార్డియాలజిస్ట్ మరియు కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ నాగ శ్రీనివాస్ విజయవంతంగా నిర్వహించారు. ప్రిడైలేషన్ తర్వాత, 29 ఎవోలుట్ ప్రో వాల్వ్‌ను చర్మాంతరంగా అమర్చారు. తరువాత, రోగికి పూర్తి గుండెపోటు వచ్చింది. గుండె లయను స్థిరీకరించడానికి వైద్యుల బృందం వెంటనే మరుసటి రోజు డ్యూయల్ ఛాంబర్ శాశ్వత పేస్‌మేకర్‌ను అమర్చింది. రోగిని వెంటిలేటర్ నుండి విజయవంతంగా తొలగించారు మరియు తగిన పర్యవేక్షణ మరియు గుండె పునరావాసం కల్పించారు. రోగి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంది. దీనిపై డాక్టర్ నాగ శ్రీనివాస్ మాట్లాడుతూ, "తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్‌కు సకాలంలో చికిత్స చేయకపోతే ప్రాణాంతకం కావచ్చు. అధిక ప్రమాదం ఉన్న రోగులకు ఓపెన్ హార్ట్ సర్జరీకి ( టఎవిఐ) ప్రక్రియ చాలా ప్రభావవంతమైన మరియు తక్కువ ఇన్వాసివ్ చికిత్స ప్రత్యామ్నాయం. సకాలంలో చికిత్స మరియు తగినంత పర్యవేక్షణ మంచి ఫలితాలను ఇస్తాయి, "అని ఆయన అన్నారు. ఈ కేసు మెడికవర్ హాస్పిటల్‌లో సంక్లిష్ట గుండె జబ్బుల నిర్వహణలో ఆధునిక సాంకేతికత మరియు నిపుణులైన వైద్య బృందం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసింది.

# ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి టీఎన్‌జీఓస్ కృతజ్ఞతలు**




**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు జారీ చేయడం, అలాగే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరును డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మారుస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల హనుమకొండ జిల్లా టీఎన్‌జీఓస్ యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ జిల్లా జేఏసీ చైర్మన్, టీఎన్‌జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, టీఎన్‌జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లకు కూడా హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షుడు శ్యామ్ సుందర్, కేంద్ర సంఘం నేతలు రాము నాయక్, లక్ష్మీ ప్రసాద్, జిల్లా నేతలు రాజేష్ ఖన్నా, సర్వర్ హుస్సేన్, రాజేశ్వర్ రెడ్డి, కలకోట్ల భరత్, రాజీవ్, అనూప్, పృథ్వీ, విజయ్ కుమార్, నిఖిల్, విక్టర్, గోవర్ధన్, హమీద్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ ఘటనలో చిన్నారి మృతి

**దోషులకు కఠిన శిక్షలు విధించాలి: రజక విద్యార్థి సంఘం**

**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన ఘటనలో రజక కుటుంబానికి చెందిన చిన్నారి మృతి చెందడం బాధాకరమని, ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ కొరపల్లి రాజేష్ డిమాండ్ చేశారు. రజక విద్యార్థి సంఘం నాయకులు పోచంపల్లి రఘుపతి, కొరపల్లి రాజేష్ మాట్లాడుతూ, సాంకేతికంగా దేశం అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో కూడా తక్కువ కులం వారని భావించి రజక కుటుంబాన్ని ఆలయంలోకి రానివ్వకుండా అడ్డుకోవడం సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకుల దురహంకారంతో చిన్నారి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని, కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు బదిలీ చేసి త్వరితగతిన విచారణ పూర్తి చేసి దోషులకు కఠిన శిక్షలు విధించేలా చర్యలు తీసుకోవాలని కొరపల్లి రాజేష్ కోరారు. ఈ కార్యక్రమంలో రజక విద్యార్థి సంఘం ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# హెల్త్ సిటీపై నిర్లక్ష్యం సహించం





**సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వెంటనే ప్రారంభించాలి: హరీష్ రావు హెచ్చరిక**

**వరంగల్, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 2000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ తరపున వరంగల్ గడ్డపైనే నిరాహార దీక్షకు దిగుతామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్ రావు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై చూపుతున్న శ్రద్ధను పేదలకు ప్రాణాధారమైన వరంగల్ 'హెల్త్ సిటీ'పై చూపడం లేదని ఆయన విమర్శించారు. వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను హరీష్ రావు ఇతర బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**దేవాదుల ప్రాజెక్టు డెడ్‌లైన్ల రాజకీయాలు**

దేవాదుల ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని, సమ్మక్క బ్యారేజీలో 10 మోటార్లలో కేవలం 6 మాత్రమే నడుస్తున్నాయని, రోజుకు 2700 క్యూసెక్కులు ఎత్తాల్సిన చోట 1700 క్యూసెక్కులు కూడా ఎత్తడం లేదని ఆరోపించారు. తాము ప్రాజెక్టును సందర్శించి లోపాలను ఎత్తిచూపిన తరువాతే సీఎం హడావుడిగా సమీక్ష నిర్వహించారని పేర్కొన్నారు. ఇది బీఆర్ఎస్ విజయం కాకుండా రైతుల విజయం అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో రూ.7300 కోట్లు ఖర్చు చేసి 3 లక్షల 20 వేల ఎకరాలకు సాగునీరు అందించామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం డెడ్‌లైన్లు మారుస్తూ కాలయాపన చేస్తోందన్నారు. మంత్రులు ఒక తేదీ, ముఖ్యమంత్రి మరో తేదీ చెబుతున్నారని, కానీ ప్రాజెక్టులో అంగుళం పని కూడా ముందుకు సాగడం లేదని విమర్శించారు. అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై మైకులు కట్ చేయకుండా, కెమెరాలు తిప్పకుండా చర్చకు రావాలని సీఎంకు సవాల్ విసిరారు.

**హెల్త్ సిటీ పనులు నత్తనడకన**

బీఆర్ఎస్ హయాంలోనే 24 అంతస్తుల స్లాబ్ పనులు పూర్తి చేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి 2024 దసరాకే ప్రారంభం కావాల్సిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో రెండు దసరాలు గడిచినా పనులు పూర్తికాలేదన్నారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే పనులను ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. జూన్ 2న ఆసుపత్రి ప్రారంభిస్తామని చెబుతున్నారని, అయితే 2000 పడకల ఆసుపత్రికి అవసరమైన సిబ్బంది నియామకాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. 2000 మంది నర్సులు, 1500 మంది డాక్టర్లు, 1000 మంది పారామెడికల్ సిబ్బంది అవసరమని, ఇప్పటివరకు క్యాబినెట్ ఆమోదం లేదా నోటిఫికేషన్ జారీ చేశారా అని ప్రశ్నించారు. కేవలం ఓపీ సేవలతో ప్రారంభించడం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తగదని అన్నారు.

**ఎంజీఎం ఆసుపత్రి పరిస్థితిపై ఆందోళన**

నాడు కేసీఆర్ హయాంలో ఉచిత గుండె ఆపరేషన్లు చేసిన ఎంజీఎం ఆసుపత్రి, నేడు నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. వీల్ చైర్లు, స్ట్రెచర్లు, పరీక్షా పరికరాలు సరిపడా లేవని, ఆపరేషన్ థియేటర్లలో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. కేథ్‌లాబ్‌లు, ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించడంలో వైఫల్యం ఉందన్నారు. రోగులను హైదరాబాద్‌కు తరలించడం జరుగుతోందని తెలిపారు.

**జర్నలిస్టులు, ఉద్యోగుల హక్కులపై డిమాండ్**

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులు, జర్నలిస్టులకు ఆరోగ్య పథకాలు అమలు చేసిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. అక్రిడేషన్ కార్డుల జారీ, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను సమానంగా అమలు చేయాలని కోరారు.

**నిరాహార దీక్షకు సిద్ధం**

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, లేకపోతే బీఆర్ఎస్ పక్షాన నిరాహార దీక్ష చేపడతామని హరీష్ రావు స్పష్టం చేశారు. కక్ష సాధింపుల రాజకీయాలు మానుకుని ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ పర్యటనలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, రవీందర్ రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, వినయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కుల అహంకార దాడిలో శిశువు మృతి

## నిందితులను కఠినంగా శిక్షించాలి: పీడీఎస్‌యూ నిరసన




**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కుల అహంకార దాడిలో రెండు నెలల పసి పాప ప్రాణాలు కోల్పోయిన ఘటనను ఖండిస్తూ నిందితులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ వరంగల్–హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హన్మకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ప్లేకార్డులతో నిర్వహించిన ఈ నిరసనలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి అజయ్ మాట్లాడుతూ, కుమ్మెర గ్రామంలో ఆరు రోజుల క్రితం దేవాలయంలోకి ప్రవేశించారనే కారణంతో చాకలి కులానికి చెందిన గణేష్, చంద్రకళ, మౌనికలపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడిలో రెండు నెలల పసిబిడ్డను కాలితో తన్నడంతో శిశువు మృతి చెందిందని పేర్కొన్నారు. ఈ ఘటనను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వారందరినీ వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు తగిన నష్టపరిహారం అందించాలన్నారు. అలాగే మెరుగైన వైద్య చికిత్సలు అందేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటన జరిగిన వారం రోజులు గడిచినా నిందితులపై తగిన చర్యలు తీసుకోలేదని, బాధితులపై కేసులు నమోదు చేయడం అన్యాయమని ఆరోపించారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన సంబంధిత పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా జోక్యం చేసుకుని నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ, జిల్లా నాయకులు చరణ్, వివేక్, శివ, ధనూష్, అరవింద్, ఆధిత్య తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు ఐక్యతతోనే ప్రజా సమస్యల పరిష్కారం: యంసిపిఐ(యు) జాతీయ కన్వెన్షన్

**జోద్‌పూర్ (రాజస్థాన్), ఫిబ్రవరి 24, 2026(జై భీమ్ న్యూస్)**







దేశంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత, సమన్వయ పోరాటాలే ఏకైక మార్గమని ఎంసిపిఐ (యూ) జాతీయ కన్వెన్షన్ పిలుపునిచ్చింది. ఫిబ్రవరి 23, 24 తేదీల్లో జోద్‌పూర్‌లోని షహీద్ భగత్ సింగ్ నగర్‌లో నిర్వహించిన జాతీయ యూనిట్ కన్వెన్షన్‌లో దేశవ్యాప్తంగా తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, చండీగఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంపికైన 220 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కామ్రేడ్స్ కిరణ్ జిత్ సింగ్ షేఖాన్, మర్రెడ్డి వెంకటరెడ్డి, గాదగోని రవి, ప్రేమ్ సింగ్ భంగ్‌ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్తుత పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ ప్రయాణం ఉన్నప్పటికీ ప్రస్తుత దేశ పరిస్థితుల్లో స్వంత బలం మీద పార్లమెంటరీ, పార్లమెంటేతర రంగాల్లో నిలబడలేని పరిస్థితులు ఉన్నాయని ఆత్మపరిశీలన అవసరమని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. 2018 నుంచి భిన్నాభిప్రాయాల నేపథ్యంలో రెండు కేంద్ర కమిటీలుగా పని చేస్తున్న పార్టీ, గత ఏడాది నుంచి చర్చలు జరిపి ఐక్యత దిశగా అడుగులు వేసింది. ఈ కన్వెన్షన్‌లో రెండు కేంద్ర కమిటీలను ఒకే కేంద్ర కమిటీగా విలీనం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కొత్తగా ఎన్నికైన కేంద్ర కమిటీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు నిర్వహిస్తూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కన్వెన్షన్ తీర్మానించింది. ఈ వివరాలను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వనం సుధాకర్ తెలిపారు.



# కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా ముగిసిన శతావధానం





### "జ్ఞాన ఉత్పత్తి విధానం శతావధానం" : వీసీ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి

**హన్మకొండ, ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

"జ్ఞాన ఉత్పత్తి విధానం శతావధానం" అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో, కాకతీయ పద్య కవితా వేదిక అధ్యక్షులు కంది శంకరయ్య అధ్యక్షతన, విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవ సంబరాల భాగంగా తెలుగు విభాగం సంయుక్త నిర్వహణలో జరిగిన "అవధాన ప్రియ చేపురి శ్రీరామ్ శతావధానం" ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నిరంతర అభ్యాసం, సాధన ద్వారానే ప్రతిభ వికసిస్తుందని తెలిపారు. అవధాన ప్రక్రియ కేవలం అభినందనీయం మాత్రమే కాకుండా భారతీయ జ్ఞాన వ్యవస్థలో కీలక భాగమని అన్నారు. భారతీయ మేధో సంప్రదాయాలలో అవధానం విశిష్ట స్థానం కలిగి ఉందని పేర్కొన్నారు. బహువిధ్యల సమాహారం, నైపుణ్యాల సమ్మేళనం శతావధానం అని కొనియాడుతూ, విజయవంతంగా శతావధానం నిర్వహించిన చేపురి శ్రీరామ్‌ను అభినందించారు. కృత్రిమ మేధస్సుకంటే మానవ మేధస్సే శ్రేష్ఠమని, ఏకాగ్రత, విషయ పరిశీలనలో అవధానం గొప్పతనాన్ని చాటుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ డాక్టర్ మహమ్మద్ రియాజ్ మాట్లాడుతూ, తెలుగు భాష ప్రాచీనమైనదిగా, సజీవ సాహిత్య సంపద కలిగిన భాషగా కొనియాడారు. వేములవాడ చాళుక్యులు, ముదిగొండ చాళుక్యుల కాలంలోనే పద్య, గద్య సాహిత్యాలు వెలుగులోకి వచ్చాయని వివరించారు. నిజాం పాలకులు కూడా తెలుగుభాషను మెచ్చుకున్నారని తెలిపారు. తెలంగాణలోని ప్రాచీన గ్రంథాలయాలు ఉద్యమాలకు నాంది పలికారని, అవధానాల పుట్టినిల్లు తెలంగాణేనని గర్వంగా చెప్పారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ మూడు రోజులపాటు సాగిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు విశేష స్ఫూర్తి పొందారని అన్నారు. కృత్రిమ మేధస్సు యుగానికి ముందుగానే కాకతీయుల కాలంలోనే అవధాన ప్రక్రియకు నాంది పలికిందని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్.ఈ.పి.) ప్రకారం నూతన సిలబస్ రూపకల్పనలో అవధాన ప్రక్రియను భాగంగా చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎం. లింగయ్య, ఉదయమని కృష్ణయ్య, దర్శనం వెంకట్ రమణ శర్మ, మారుమాముల దత్తాత్రేయ శర్మ, డాక్టర్ కర్రే సదాశివ తదితరులు పాల్గొన్నారు. పృచ్ఛకులు, ప్రశ్నికులు మరియు ఇతర విశిష్ట అతిథులను శాలువాలతో సన్మానించారు. శతావధానం ముగింపు సభ సాహిత్య స్ఫూర్తిని, తెలుగు భాష వైభవాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా చాటింది.

# అక్రిడిటేషన్ కార్డుల తగ్గింపుపై డెస్క్ జర్నలిస్టుల గర్జన
## హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకో

### కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం

**హన్మకొండ, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా డెస్క్ జర్నలిస్టులు మరియు ఇతర విభాగాల జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య తగ్గింపును నిరసిస్తూ హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట డెస్క్ జర్నలిస్టులు భారీగా ఆందోళన చేపట్టారు. ధర్నాతో పాటు రాస్తారోకో నిర్వహిస్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో డెస్క్ జర్నలిస్టులతో పాటు వివిధ జర్నలిస్టు యూనియన్ల నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. "జర్నలిస్టుల హక్కులు కాపాడాలి", "అక్రిడిటేషన్ కార్డులు పునరుద్ధరించాలి", "ప్రెస్ స్వేచ్ఛను పరిరక్షించాలి" అంటూ నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం మార్మోగింది. కొంతసేపు రాస్తారోకో నిర్వహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డెస్క్ జర్నలిస్టులు కూడా ఫీల్డ్ జర్నలిస్టుల మాదిరిగానే వార్తల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారిని అక్రిడిటేషన్ ప్రక్రియలో పక్కన పెట్టడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అమలులో ఉన్న విధానాన్నే కొనసాగిస్తూ డెస్క్ జర్నలిస్టులకు కూడా సమానంగా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ కార్డు జర్నలిస్టుల హక్కు మాత్రమే కాకుండా వారి భద్రత, గుర్తింపు కోసం కూడా అవసరమని పేర్కొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కు అందజేశారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ ఆందోళనలో తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, బిఆర్ లెనిన్, జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి తోట సుధాకర్, మస్కపురి సుధాకర్, రాజ్ కుమార్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



కంకనాల సంతోష్, డెస్క్ జర్నలిస్టులు శంకేషి శంకర్ రావు, సిహెచ్ సోమనర్సయ్య, వర్దెల్లి లింగయ్య, అల్లం రాజేష్ వర్మ, అలాగే కోరుకొప్పుల నరేందర్, బోల్ల అమర్, బొడిగె శ్రీనివాస్, సంపత్ రావు, కిరణ్ రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఎం. సుధాకర్, శ్రీకాంత్, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు.

# కాకతీయ విశ్వవిద్యాలయం పీజీ, ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల రివైజ్డ్ టైమ్ టేబుల్ విడుదల

**వరంగల్, 24 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వాయిదా పడిన కాకతీయ విశ్వవిద్యాలయ పీజీ మొదటి సెమిస్టర్, ఎంబీఏ మొదటి సెమిస్టర్, ఎంసీఏ మొదటి సెమిస్టర్ పరీక్షల రివైజ్డ్ టైమ్ టేబుల్‌ను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ అసిం ఇక్బాల్ విడుదల చేశారు. విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మార్చి 5న ప్రారంభమై మార్చి 18 వరకు కొనసాగనున్నాయి. మార్చి 5న మొదటి పేపర్, మార్చి 7న రెండవ పేపర్, మార్చి 10న మూడవ పేపర్, మార్చి 12న నాల్గవ పేపర్, మార్చి 16న ఐదవ పేపర్, మార్చి 18న ఆరవ పేపర్ నిర్వహించబడతాయి. అలాగే ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలు మార్చి 6న ప్రారంభమై మార్చి 24 వరకు జరుగనున్నాయి. మార్చి 6న మొదటి పేపర్, మార్చి 9న రెండవ పేపర్, మార్చి 11న మూడవ పేపర్, మార్చి 13న నాల్గవ పేపర్, మార్చి 17న ఐదవ పేపర్, మార్చి 20న ఆరవ పేపర్, మార్చి 24న ఏడవ పేపర్ నిర్వహించనున్నారు. ఎంసీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలు మార్చి 6న ప్రారంభమై మార్చి 17 వరకు కొనసాగుతాయి. మార్చి 6న మొదటి పేపర్, మార్చి 9న రెండవ పేపర్, మార్చి 11న మూడవ పేపర్, మార్చి 13న నాల్గవ పేపర్, మార్చి 17న ఐదవ పేపర్ జరుగుతాయి. పరీక్షలు ముందుగా ప్రకటించిన కేంద్రాల్లో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించబడతాయని అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లు, పరీక్షా కేంద్ర వివరాలను పరిశీలించి సమయానికి హాజరు కావాలని సూచించారు.




# గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర

### గంగదేవిపల్లిలో నూతన సర్పంచులకు శిక్షణ ప్రారంభం





**వరంగల్ జిల్లా / గీసుకొండ, ఫిబ్రవరి 24, 2026(జై భీమ్ న్యూస్)**

గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. దేశంలోనే ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో జిల్లాలోని 11 మండలాలకు చెందిన నూతన సర్పంచుల కోసం మూడు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళవారం మూడవ మరియు చివరి విడతలో భాగంగా వర్ధన్నపేట, పర్వతగిరి, నెక్కొండ, నల్లబెల్లి మండలాలకు చెందిన సర్పంచులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రారంభ సమావేశానికి కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రథమ పౌరులుగా సర్పంచ్‌లు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, ఇంటి పన్నుల వసూలు, పంచాయతీ నిధుల వినియోగం వంటి అంశాలను సమర్థంగా పర్యవేక్షించాలని తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టాలు, సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణలో భాగంగా గ్రామ పంచాయతీ పనుల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సర్పంచ్‌లను కోరారు. డిజిటల్ గవర్నెన్స్‌కు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ పారదర్శక పాలన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డీపీవో కల్పన, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయం న్యూ పి.జి. హాస్టల్ ఘర్షణలపై విచారణ కమిటీ నియామకం




**వరంగల్, 24 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఆదివారం రాత్రి యూనివర్సిటీ క్యాంపస్‌లోని న్యూ పి.జి. హాస్టల్‌లో చోటుచేసుకున్న విద్యార్థుల ఘర్షణల ఘటనపై యూనివర్సిటీ యాజమాన్యం తక్షణమే స్పందించింది. ఈ సంఘటనను అత్యంత సీరియస్‌గా పరిగణించిన వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం విచారణ కమిటీని నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్‌ను కమిటీ చైర్మన్‌గా నియమించారు. ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య బి. సురేష్ లాల్, కామర్స్ విభాగాధిపతి ఆచార్య ఎస్. నరసింహ చారి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య మామిడల ఇస్తారి, హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ పి. శ్రీనివాస్ సభ్యులుగా నియమితులయ్యారు. సహాయ రిజిస్ట్రార్ చె. ప్రణయ్ కుమార్ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. సంబంధిత ఘటనపై సమగ్రంగా విచారణ నిర్వహించి, బాధ్యులపై తగిన చర్యలు సూచిస్తూ కమిటీ తన నివేదికను రిజిస్ట్రార్‌కు సమర్పించనుంది. క్యాంపస్‌లో శాంతి భద్రతలను కాపాడేందుకు యాజమాన్యం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేందుకు విశ్వవిద్యాలయ పరిపాలన కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



# ‘ది కేరళ స్టోరీ-2’కు సెన్సార్ సెగ

**16 కోతలు.. సగానికి పైగా తగ్గిన ముద్దు సీన్లు!**
**విడుదలకు ముందే ‘ది కేరళ స్టోరీ-2’ ప్రకంపనలు**
**డైలాగ్స్, సన్నివేశాల విషయంలో కఠినంగా వ్యవహరించిన సెన్సార్ బోర్డు**
**మత సామరస్యం విషయంలో పొరపాట్లు జరగకూడదన్న సెన్సార్ బోర్డు**

బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన ‘ది కేరళ స్టోరీ’కి సీక్వెల్‌గా వస్తున్న రెండో భాగం విడుదలకు ముందే వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. చిత్రంలోని సున్నితమైన అంశాలు, హింసాత్మక దృశ్యాలపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్ సీ) ఉక్కుపాదం మోపింది. కేవలం డైలాగులకే పరిమితం కాకుండా, విజువల్స్ విషయంలోనూ బోర్డు అత్యంత కఠినంగా వ్యవహరించడం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రానికి సంబంధించి సెన్సార్ బోర్డు మొత్తం 16 మార్పులను సూచించింది. వీటిలో ప్రధానంగా అత్యాచారానికి సంబంధించిన ఒక సుదీర్ఘమైన దృశ్యాన్ని పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, అటువంటి హింసాత్మక విజువల్స్‌కు తావులేదని బోర్డు స్పష్టం చేసింది. ఇక రొమాంటిక్ సీన్ల విషయానికి వస్తే.. ఒరిజినల్ వెర్షన్‌లో ఉన్న ముద్దు సీన్ల నిడివిని ఏకంగా 50 శాతానికి తగ్గించేశారు. శృంగారభరిత దృశ్యాల విషయంలో రాజీ పడకూడదని సెన్సార్ సభ్యులు నిర్ణయించారు. కేవలం దృశ్యాలే కాకుండా, చిత్రంలోని కొన్ని కీలక సంభాషణలు కూడా మార్పులకు గురయ్యాయి. సమాజంలోని కొన్ని వర్గాలను కించపరిచేలా ఉన్న పదాలను తొలగించి, వాటి స్థానంలో అర్థం మారకుండా ఉండే ప్రత్యామ్నాయ పదాలను చేర్చాలని మేకర్స్‌కు సెన్సార్ బోర్డు సూచించింది. దేశ సార్వభౌమాధికారం, మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకూడదని సెన్సార్ బోర్డు గట్టిగా నొక్కి చెప్పింది. దీంతో చిత్ర యూనిట్ ఈ మార్పులన్నింటికీ అంగీకరించి ‘ఖ/యూ’ సర్టిఫికెట్ పొందినట్లు సమాచారం. ఈ సినిమా తొలి భాగం కేరళలో జరిగిన మత మార్పిడుల నేపథ్యంలో వచ్చి దేశవ్యాప్తంగా చర్చలకు దారితీసింది. ఇప్పుడు రెండో భాగంలోనూ అటువంటి వివాదాస్పద అంశాలనే టచ్ చేసినట్లు సెన్సార్ కట్‌లను బట్టి అర్థమవుతోంది. అయితే, సెన్సార్ బోర్డు విధించిన ఈ ఆంక్షలు సినిమాను ఏ మేరకు దెబ్బతీస్తాయి? లేక ఈ వివాదాలే సినిమాకు మరింత పబ్లిసిటీ తెచ్చి పెడతాయా? అన్నది వేచి చూడాలి. ఏదేమైనా, సినిమా నిడివి తగ్గినా.. ప్రభావం మాత్రం తగ్గకూడదని దర్శకుడు సుదీప్తో సేన్ బృందం భావిస్తోంది.



# అనూహ్యమైన మలుపులతో సాగే ‘అక్యూజ్డ్’

‘నెట్ ఫ్లిక్స్’ వారు నిర్మించిన హిందీ సినిమానే ‘అక్యూజ్డ్’. నేరుగా ఓటీటీ ద్వారా ప్రేక్షకులను పలకరించడానికి ఈ సినిమా సిద్ధమవుతోంది. విభిన్నమైన కంటెంట్ తో .. బలమైన తారాగణంతో నిర్మించిన ఈ సినిమాలో, కొంకణా సేన్ శర్మ ప్రధానమైన పాత్రను పోషించారు. కొంకణాసేన్ శర్మ ఎంచుకునే పాత్రలు విభిన్నంగా .. విలక్షణంగా ఉంటాయి. నటన విషయంలోను ఆమె తనకంటూ ఒక పత్యేకమైన మార్క్ ను సొంతం చేసుకున్నారు. ఈ కారణంగానే కొంకణా సేన్ శర్మ సినిమాలను .. సిరీస్ లను తప్పకుండా చూస్తుంటారు. అలా ఆమె చేసిన సినిమానే ఇది. సైకలాజికల్ థ్రిల్లర్ ను టచ్ చేస్తూ సాగే ఈ సినిమాను, ఈ నెల 27వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. గైనకాలజిస్ట్ ‘గీతిక’ పాత్రలో ఆమె కనిపించనుంది. తన కెరియర్ లో ఈ పాత్రకు ప్రత్యేకమైన స్థానం ఇస్తానని ఆమె చెబుతుండటం విశేషం. కథ విషయానికి వస్తే .. గైనకాలజిస్ట్ గా గీతికకి మంచి పేరు ఉంటుంది. తన ప్రతిభకి తగిన స్థాయికి చేరుకోవడానికి ఆమెకి అవకాశాలు వస్తుంటాయి. ఈ విషయంలో ఎలాంటి పోటీని ఎదుర్కోవడానికైనా ఆమె సిద్ధమవుతుంది. అలాంటి పరిస్థితులలో ఆమెపై లైంగిక ఆరోపణలు వస్తాయి. తన కెరియర్ ను .. తన పరువు ప్రతిష్ఠలను ప్రభావితం చేసే ఆరోపణలను ఆమె ఎలా ఎదుర్కొంటుంది? అనేది కథ.



# ఐశ్వర్య అర్జున్‌కి మిగిలింది చేదు అనుభవమే!

తెలుగు తెరకి వారసులుగా హీరోలు పరిచయం కావడం సాధారణమైన విషయమే. అయితే సీనియర్ హీరోల కూతుళ్లు హీరోయిన్స్ గా ఎంట్రీ ఇవ్వడమనేది ఈ మధ్యనే కాస్త ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే అర్జున్ కూతురు ఐశ్వర్య హీరోయిన్ గా టాలీవుడ్ లో అడుగుపెట్టింది. ఇక్కడ తన తొలి సినిమాగా ‘సీతా పయనం’ చేసింది. అర్జున్ ఈ సినిమాకి నిర్మాతగా .. దర్శకుడిగా వ్యవహరించడం విశేషం. అయితే ఈ సినిమా ఫలితం నిరాశపరిచిన విషయం తెలిసిందే. నిజానికి అర్జున్ కూతురు కోలీవుడ్ లో హీరోయిన్ గా అడుగుపెట్టి చాలాకాలమే అయింది. అప్పట్లోనే ఆమె తెలుగులో కూడా చేసి ఉండవలసింది. అయితే ఆమె టాలీవుడ్ వైపుకు రావడంలో చాలా ఆలస్యం చేసింది. నిజానికి ఈ సినిమా కోసం అర్జున్ టాలీవుడ్ లో చాలా వరకూ చుట్టబెట్టారు. ఎంతోమందిని కలుసుకున్నారు. ప్రమోషన్స్ వైపు నుంచి ఈ సినిమాను ఆడియన్స్ కి చేరువగా తీసుకుని వెళ్లడానికి చాలా ప్రయత్నాలు చేశారు. అయితే అవేవీ ఆశించిన ప్రయోజనాన్ని మాత్రం ఇవ్వలేకపోయాయి. ఈ సినిమా విషయంలో రెండు రకాల అభిప్రాయాలు వినిపించాయి. అర్జున్ తన కూతురు సినిమాను తాను డైరెక్ట్ చేయకుండగా ఉండవలసిందనీ, నిర్మాతగా ఆయనే ఉండటం మంచిదైందని చెప్పుకున్నారు. ఎందుకంటే ఆర్థికపరమైన విషయాల వైపు నుంచి ఆయనకి విమర్శలు లేకుండా పోయాయి. కథలో అనవసరమైన విషయాల సంఖ్య పెరగడం, హీరోయిన్ తో పాటు హీరో కూడా కనెక్ట్ కాకపోవడం మైనస్ అయింది. మొత్తానికి ఈ సినిమా ఐశ్వర్య అర్జున్ కి చేదు అనుభవాన్నే మిగిల్చిందని చెప్పాలి.